మార్చి - ఏప్రియల్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



ఆయన పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది.



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

క్రీస్తునందు ప్రియులైన వారికి నా వందనములు. యేసుక్రీస్తు ద్వారా మీకు శుభములు కలుగును గాక. నూతన సంవత్సరములో మూడవ నెలలో ప్రవేశపెట్టిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు వాడునైన యేసువైపు చూచుచు ఈ పరుగు పందెములో ఓపికతో పరిగెత్తుదుము.

ఈ నెల ఫైనల్ ఎగ్జామ్స్ అన్నీ ప్రారంభం అవుతూ ఉన్నాయి. ఎగ్జామ్స్ వ్రాస్తున్న పిల్లలకు దేవుడు మంచి జ్ఞానం ఇవ్వాలని ప్రార్థన చేయవలసి ఉన్నది. భవిష్యత్‌లో ఎలాంటి కోర్సులో జాయిన్ అవ్వాలి అనే మంచి గైడెన్స్ కొరకు దేవునిని వేడుకుందాము. యౌవ్వన కాలములో దేవుని భయము కలిగి నడుచుకొని తద్వారా సంఘమునకు, సమాజమునకు ఉపయోగపడాలి అని కోరుకుందాము.

దేవుని సంఘములో బాధ్యత కలిగిన వ్యక్తులుగా ఉండడానికి ప్రయాసపడదాం. నేటి దినములలో మనుష్యులకు బాధ్యతలు అను వాటి మీద పెద్ద శ్రద్ధ లేదు. మనము దేవుని తెలుసుకొని, దేవునిలో జీవించడానికి కారణమైన పరిచర్య పట్ల ఎంత శ్రద్ధ కలిగియుండవలయును? సంఘము కొరకు క్రీస్తు తన ప్రాణమును ఇచ్చునంతగా బాధ్యతను కలిగియున్నాడు. క్రీస్తు యేసుకు కలిగిన ఈ మనస్సు మనమును కలిగియుందాము.

మన దేశపు ఆర్థిక వ్యవస్థ ఎంతో ఒడిదుడుకుల మధ్యలో ఉన్నది. దీనివలన నిరుద్యోగము, ఉన్న ఉద్యోగము కోత, అభివృద్ధి పనులకు ఆటంకం మొదలైన సమస్యలు తలెత్తుతాయి. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దీని యొక్క ప్రభావము సామాన్యమైన మనుష్యుల మీద కూడా పడుతుంది. ప్రార్థన ద్వారా మార్పు చెందని పరిస్థితులు అంటూ ఏమీ ఉండవు కనుక భారము కలిగి ప్రార్థన చేద్దాము.

మీ సహోదరుడు.....

మార్చి - ఏప్రియల్, 2012

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- మంచి సమరయుడు ........ 2
- చదవండి - చదివించండి... ........ 5
- రాహేబు (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- నీవు ఉన్నట్టా..? లేనట్టా...! ........ 8
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 21వ భాగము ........ 11
- ఎక్కువ - తక్కువ వద్దు (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- ఆహారపు అలవాట్లు, శరీర పోషణ ........ 17
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే ........ 19
- అర్నోను నది ........ 21
- బైబిల్ క్విజ్-21 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# మంచి సమరయుడు


**- బ్రదర్. ఎపఫ్రా**

లోకములో విజయమునకు అందరూ స్నేహితులే, శత్రువులు ఎవ్వరూ ఉండరు. అలాగే అపజయమునకు అందరూ శత్రువులే మిత్రులు ఎవ్వరూ ఉండరు ఇది లోకం పోకడ.

మన సమాజములో రాజకీయ పార్టీలను చూచిన, వాణిజ్య సంస్థలను చూచిన ఒకటే లక్ష్యం విజయమును అందించేవారి కోసమే పోటీ పడుతూ ఉంటాయి, కాని సృష్టికర్తయైన దేవుడు ఓటమిలో ఉన్నవారికి మిత్రుడై, శ్రేయోభిలాషియై వారిని ఓటమి నుండి విజయములోనికి నడిపిస్తాడు. ఈ విషయమును గురించి బైబిల్ గ్రంథమును పరిశీలిస్తే యెరూషలేము అనే పట్టణం గురించి **“భూమి తోడన వద్దు, అది ఆయన పాదపీఠము, యెరూషలేము తోడన వద్దు, అది మహారాజు పట్టణము” మత్తయి 5:35.** యెరికో అనే పట్టణం గురించి **“ఎవడు యెరికో పట్టణమును కట్టించపూనుకొనునో వాడు యెహోవా దృష్టికి శాపగ్రస్తుడగును, వాడు దాని పునాది వేయగా వాని జ్యేష్ఠకుమారుడు చచ్చును, దాని తలుపులను నిలువనెత్తగా వాని కనిష్ఠకుమారుడు చచ్చును. యెహోషువ 6:26**

యెరూషలేము పట్టణము నుండి యెరికో వరకు సుమారుగా 25 కి.మీ దూరం. యెరూషలేము సముద్ర మట్టమునకు 800 మీటర్ల ఎత్తులో ఉంటే, యెరికో 250 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అనగా ఈ పట్టణముల మధ్య ప్రయాణం ఏటవాలుగా ఉంటుంది.

ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు ప్రయాణమై వెళ్తూ ఉన్నప్పుడు దొంగల చేతికి చిక్కియున్నాడు. దొంగలు అతని వస్త్రములను దోచుకొని, కొట్టి కొరప్రాణముతో విడిచిపోయారు. ఆ దారి గుండా యాజకుడు ప్రయాణిస్తూ, కొరప్రాణముతో పడి ఉన్న వ్యక్తిని చూచి ప్రక్కగా వెళ్ళి పోయాడు. ప్రాణం పోతున్న వ్యక్తిని చూచి ఎలా వెళ్ళిపోగలిగాడు? యాజకుడు అనగా దేవుని మందిరములో బలులు, అర్పణలు అర్పించే ముఖ్యుడు. ఇతడు దేవునికి మనుష్యులకు మధ్యవర్తి, కాని అతను అనుసరిస్తున్న ధర్మశాస్త్ర నియమము ప్రాణం పోతున్న వ్యక్తికి సహాయం చేయకుండా చేసింది. **యాజకులగు అహరోను కుమారులతో ఇట్లనుము - మీలో ఎవడును తన ప్రజలలో శవమును ముట్టుట వలన తన్ను అపవిత్ర పరచు కొనరాదు - లేవీ 21:2.** ఎక్కడ కొర ప్రాణముతో ఉన్నవాడి ప్రాణం పోతే ధర్మ శాస్త్రమును మీరినవాడను అవుతాననే భయం.



యాజకుడు వెళ్ళిపోయిన తరువాత ఆ మార్గములో లేవీయుడు ప్రయాణిస్తూ ఉన్నప్పుడు దొంగల చేతికి చిక్కినవాడు పడియుండుట చూచి, ఏ మాత్రం పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. లేవీయులు ఇశ్రాయేలు గోత్రీకులు. దేవుని మందిరపు ఉపకరణములను మోయునట్లుగాను, ఇశ్రాయేలీయుల కానాను ప్రయాణంలో ప్రత్యక్షపు గుడారము వేయ డానికి, తీయడానికి వీరిని దేవుడు ఏర్పరచుకున్నాడు. వారు మందిరపు సేవ చేయుచు దాని చుట్టూ మాత్రమే ఉండవలసిన వారు. లేవీయులు దేవుని మందిర పనికి ప్రత్యేకపరచబడినవారు. లేవీయుడైన ఇతనికి కూడా సహాయపడడానికి మనస్సు లేదు. వారి వారి ధర్మశాస్త్ర నియమముల కొరకు ఉన్న శ్రద్ధ ప్రాణం పోతున్న వాడిని రక్షించడానికి లేదు.



సమరయుడు అదే దారిలో వెళ్ళుచున్నాడు. సమాజములో సమరయులు అనగా హీనమైన స్థితిలో ఉన్నవారు. ఎవరూ వారితో సాంగత్యం చేయడానికి గాని, వారు ఇచ్చిన నీళ్ళు త్రాగడానికి కూడా ఇష్టపడరు. ఇలాంటి అధమ స్థాయిలో ఉన్న వ్యక్తి ఉన్నతమైన ఆలోచనా విధానముతో కొరప్రాణముతో ఉన్న వాడిని రక్షించడం జరిగింది.

**"అయితే ఒక సమరయుడు ప్రయాణమై పోవుచు, అతడు పడియున్న చోటికి వచ్చి, అతనిని చూచి, అతని మీద జాలిపడి దగ్గరకు పోయి, నూనెయు ద్రాక్షారసమును పోసి**

**అతని గాయములను కట్టి తన వాహనము మీద ఎక్కించి యొక పూటకూళ్ళ వాని ఇంటికి తీసికొని పోయి అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్ళ వానికిచ్చి - ఇతని పరామర్శించుము. నీవింకేమైనను ఖర్చు చేసిన యెడల నేను మరల వచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పిపోయెను. - లూకా 10:33-35**
అతనిని ఒక మనుష్యునిగా తీర్చిదిద్దే బాధ్యతను సమరయుడు తీసుకున్నాడు.

నేడు మనుష్యులు ఇలాంటి మనస్సు కలిగి ఎంతమంది జీవిస్తున్నారు? **ఏలయనగా మనమింక బలహీనమై యుండగా, క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు, మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును! అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు, ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను రోమా 5:6-8**

ప్రభువైన యేసు మానవాళికి ఇచ్చిన సందేశంలో నశించిన దానిని వెదకి రక్షించడానికి ఈ లోకమునకు వచ్చానని చెప్పడం జరిగింది.

మనం నేను నీతిగానే బ్రతుకుతున్నాను. కాబట్టి నేను బాగానే ఉన్నాను అని భావించక శత్రువైన సాతాను చేత బంధించబడిన వారిని, దోచుకొనబడిన వారిని ప్రేమతో చేరదీసి వారి మనోవ్యధలను సరిచేయడానికి, హృదయ గాయములను కట్టడానికి ప్రయాసపడవలెనని ఈ సమరయుని జీవితం మనకు బోధిస్తున్నది. సమరయుడు తన ధనమును, సమయమును వెచ్చించి ఈ మంచి కార్యము చేసినట్లు మనం చూస్తున్నాం.

మన జీవితములలో అట్టి ఉన్నత స్థాయి ఆలోచనలను దేవుడు అనుగ్రహించును గాక !


## గుడ్ ఫ్రైడే ఆరాధన

**ఏప్రియల్ 6, 2012వ తేది (శుక్రవారం)**
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును

వివరములకు: 9666666249
040-24202227

# చదవండి - చదివించండి; మారండి - జీవితమును ఆస్వాధించండి

1. అన్నిటికి మేమే పెద్దవారము, గొప్పవారము అనే అహంభావం ప్రదర్శించకండి
2. అర్థం పర్థం లేకుండా పర్యవసానాలు ఏమిటో గ్రహించకుండా అనవసరంగా ఏదేదో మాట్లాడడం మానండి
3. ఏ వ్యవహారములోనైనా, తగాదాలోనైనా నేర్పుగా, ఓర్పుగా వ్యవహరించండి
4. కొన్ని సందర్భములలో కొన్ని సంకట పరిస్థితులను ఓర్పుగా సహించి ఉండాలని గ్రహించండి
5. మీరు చెప్పినదే సరైనది, మీరు చేసినదే సరైనది అని వాదులాడకండి. సంకుచిత మనస్తత్వాన్ని విడిచిపెట్టండి
6. ఏది నిజమో, అబద్ధమో సరిగా తెలుసుకోకుండా ఇక్కడ విన్నది అక్కడ, అక్కడ విన్నది ఇక్కడ మాట్లాడడం మానండి
7. మిగిలిన వారికన్నా మీరే గొప్పవారిమనుకుంటూ, మీ గురించి మీరు ఉన్నతంగా ఊహించుకుంటూ గర్వపడకండి
8. అవతల వాళ్ళకు సంబంధం ఉన్నా, లేకపోయినా మీ పాటికి మీరు ప్రతి ఒక్కరి దగ్గరా అన్ని విషయములు చెప్పడమనే అలవాటు మానుకొండి
9. మీ చెవిన పడ్డంత మాత్రాన ప్రతి విషయమును నమ్మకండి. చిన్న చిన్న విషయములను పెద్దవిగా చేసుకోకండి
10. మీరు చెప్పిందే సరైనది అంటూ మంకు పట్టు పట్టకండి. కాస్తంత పట్టువిడుపు చూపండి.
11. ఇతరుల మాటలనూ, చేతలను, జరుగుతున్న విషయములను తప్పుగా అర్థం చేసుకోకండి
12. ఇతరులతో మర్యాదగా వ్యవహరించడం, మర్యాదతో హృదయపూర్వకంగా మాట్లాడడం మరువవద్దు.
13. చిరునవ్వుతో పలకరించడానికి, ప్రేమగా మాట్లాడడానికి కూడా తీరిక లేనట్లుగా ప్రవర్తించకండి
14. మాటలలో కాని, చేతలలో కాని మర్యాద లేని పదాలు వాడకండి అనవసరమైన దర్పం చూపకండి. అణుకువ చూపుతూ, మంచిగా, మర్యాదగా వ్యవహరించండి.
15. ఏదైనా తగాదా వచ్చినప్పుడు అవతలి వాళ్ళే ముందుగా దిగి రావాలని ఎదురు చూడకండి, మీరే మాట్లాడడానికి ముందుకు రండి.

ఇంట్లోనైనా సరే, ఆఫీసులోనైనా సరే మానవ సంబంధములలో సమస్యలు రాకుండా ఒకటి, అర సమస్యలు వచ్చినా అవి గోరంతలు కొండంతలు కాకుండా సంబంధములు అభివృద్ధి చెందాలంటే మనము పైన ఉన్నవాటిని అనుసరించుట మంచిది.

# రాహాబు

- సిస్టర్ విజయ

**విశ్వాసమును బట్టి రాహాబను వేశ్య వేగులవారిని సమాధానముగా చేర్చుకొనినందున అవిధేయులతో పాటు నశింపకపోయెను - హెబ్రీ 11:31**

పైన ఉన్న వాక్యములు విశ్వాసమును బట్టి అని వ్రాయబడుట మనం గమనిస్తున్నాం. విశ్వాసము అనగా నిరీక్షించుచున్న వాటి యొక్క నిజస్వరూపం. నేడు అనేకులకు విశ్వాసము అనేదానికి అర్థంకూడా తెలీదు. లేనిదానిని ఉన్నట్లుగా భావించేది విశ్వాసము.

జీవితములో వినిన మాటలను బట్టి విశ్వాసము అన్న దానిని సంపాదించుకుంటాం. రాహాబు అనే స్త్రీ వేశ్య, సమాజంలో అందరి చేత తృణీకరింపబడినది, ఏ మాత్రమూ విలువ లేనిది. ఆమె యిల్లు యెరికో ప్రాకారపు గోడపైన కట్టబడివున్నది. ఆగోడ ఇంచుమించు 30 అడుగుల ఎత్తు. ఇశ్రాయేలీయుల కానాను ప్రయాణంలో యెరికో అనే పట్టణము అడ్డంగా ఉన్నది. అందుకు వారు ఆ యెరికోను జయించి ముందుకు వెళ్ళాలని ప్రయత్నిస్తూ యుద్ధం చేయడానికి ముందు ఇద్దరు వేగులవారిని అక్కడికి పంపడం జరిగింది. వారు ఆ పట్టణంలోనికి ప్రవేశించి రాహాబు ఇంట బసచేశారు. **అప్పుడు రాహాబు వారితో - యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడనియు మీ వలన మాకు భయము పుట్టుననియు, మీ భయము వలన ఈ దేశ నివాసులందరికి ధైర్యము చెడుననియు నేనెరుగుదును. మీ యెదుట యెహోవా యెఱ్ఱ సముద్రపు నీరు ఏలాగు ఆరిపోచేసెనో, శత్రురాజులను మీరేలాగు నిర్మూలము చేసితిరో మేము వినినప్పుడు మా గుండెలు కరిగిపోయెను. మీ దేవుడు పైన ఆకాశమందును, క్రింద భూమియందును దేవుడే. మీ ఎదుట ఎట్టి మనుష్యులకైననూ ధైర్యము ఏ మాత్రము ఉండదు** అని చెప్పింది. ఈ సమాచారం నాయకుడైన యెహోషువకు ఎంతో ప్రోత్సాహమును ఇచ్చింది. రాహాబు ఒక వేశ్యే కానీ ఆమె కలిగి ఉన్న విశ్వాసం తన మాటలు మరియు క్రియల ద్వారా వెల్లడి అయినప్పుడు అమె ఎంతో ఉపయోగకరంగా ఉంది.

దేవుని దృష్టిలో రాహాబుకు యెరికో పట్టణస్థులకు ఉన్న వ్యత్యాసం ఏమిటి? రాహాబు యొక్క విశ్వాసం దేవుని దృష్టిలో ఎందుకు ఘనమైనది? క్రొత్త నిబంధన గ్రంథములో కూడా ఆమె విశ్వాసం గూర్చి జ్ఞాపకం చేయడం జరిగింది. బాల్యము నుండి ఆయనను ఎరగక పోయినప్పటికిని, ఆ దేవుని గురించి మాట వినగానే దృఢంగా ఆయనను నమ్మగలిగింది. యెరికో ప్రజల యొక్క ఆలోచనా విధానం దీనికి పూర్తి విరుద్ధమైనది. వారు నిజ దేవునిని ఎంత మాత్రం నమ్మినవారుకారు. దేవుని ప్రజలను పూర్తిగా వ్యతిరేకించిన

వారు. అందుకే యెరికో పట్టణం మొత్తంలో రాహాబు ఇల్లు ఒక్కటే సురక్షిత ప్రదేశంగా మారింది. ఎర్రని దారం అనగా రక్తరంగు దారం, బలి అర్పణ మూలంగా కలిగిన భద్రతను సూచిస్తూ ఉంది. (నిర్గమ 12:7-13)

రాహాబు తన విశ్వాసమును బట్టి తన కుటుంబ సభ్యులందరికి రక్షణ సాధనంగా ఉండగలిగింది. ఆ పట్టణములో గొప్ప గొప్ప జ్ఞానవంతులు, ధనవంతులు యుద్ధ శూరులు ఉన్నారు. వారు ఎవ్వరూ కూడా వారి కుటుంబములను కాపాడుకోలేకపోయారు. యెరికో వెండి, బంగారం, ఇత్తడి, వెలగలిగిన సమస్తము నశించిపోవడం కనబడుతూ ఉంది. రాజ్యమును పరిపాలన చేసే రాజులకు సహితము దొరకని ఈ భాగ్యము ఆమెకు ఆమె ఇంటి వారికి దొరికింది.

క్రొత్త నిబంధన ప్రజలమైన మనము రాహాబు ద్వారా నేర్చుకొనవలసినది ఎంతో ఉంది. ఆమె గొప్ప జ్ఞానవంతురాలు కాకపోయిన, ఉన్నతమైన కుటుంబ నేపథ్యములో నుండి రాకపోయిన సత్య దేవుని గూర్చి వినిన దానిని విశ్వసించడం ద్వారా తాను తన ఇంటివారు రక్షించబడ్డారు. అంత మాత్రమే కాక రాహాబు మన పితరుడైన దావీదుకు పూర్వీకురాలు (మత్తయి 1:5) దావీదు వంశములోనే మన ప్రభువైన యేసుక్రీస్తు పుట్టడం జరిగింది. ఎంత ధన్యత! ఒక వేశ్య హీనమైన స్థితి నుండి ఎలా ఉన్నతమైన స్థితికి చేరుకుందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

చాలామంది స్త్రీలు తమ వైపు తాము చూచుకుంటూ నాకు జ్ఞానం లేదు, ఏదీ రాదు, మంచి దానిని కాను అని తలంచుచు స్వనీతితో బ్రతుకుతూ ఉంటారు. కృప అనగా అర్హత లేనివారిని అర్హులుగా చేసేది. తమని తాము హీనపరుచుకునేవారు కృపని తృణీకరించుచున్నారు అనే సంగతిని గ్రహించాలి. కనుక మన నీతిని బట్టి కాక మనము దేవుని యందు ఉంచు విశ్వాసమును బట్టి కృపచేతనే రక్షించబడుచున్నాము. రాహాబు పాత నిబంధనా కాలంలో అపాయం నుండి రక్షించబడితే, నేడు నూతన నిబంధనా ప్రజలుగా యేసుక్రీస్తుని గూర్చిన సిలువ, మరణ, పునరుత్థానములను గూర్చి మనము విశ్వసించిన యెడల భయంకరమైన నాశనం నుండి తప్పించబడి అనగా నిత్య అగ్ని గుండములో నుండి నిత్య జీవములోనికి చేర్చబడతాము.

# నీవు ఉన్నట్టా...? లేనట్టా ...! లేక ఉండి ... లేనట్టా ...?

మానవుడు ఊహ తెలిసిన నాటి నుండి వృద్ధాప్యం వరకు హద్దులు లేని కోరికల వైపు ప్రయాణిస్తూ, మిక్కిలి ఆయాసంతో ఈ జీవితం తన కొరకు, తన వాళ్ళ కొరకే అన్నట్లు దేవుడు ఇచ్చిన విలువైన జీవిత కాలమును అర్థరహితంగానే ముగిస్తున్నాడు.

"నిజానికి మానవుడు ఎంత కాలం భూమి మీద జీవించాడు అనేది ప్రాముఖ్యం కాదు గాని, ఎంత మంది జీవితములను తన జీవితం ద్వారా ప్రభావితం చెందిస్తూ ఒక మంచి మాదిరిని ఈ ప్రపంచంలోని భావితరముల వారికి పరిచయం చేశాడు, చేస్తున్నాడు అనేది ఎంతో ప్రాముఖ్యం." పరిశుద్ధ గ్రంథంలో దేవుని ఆమోద ముద్ర పొందిన ఎంతో మంది పరిశుద్ధుల జీవితములు నేటికి మనతో మాట్లాడుతూ, ప్రభావితం చేస్తున్నాయి.

వరుసక్రమంలో చూచినట్లైతే... హనోకు, నోవహు, మోషే, యెహోషువ, కాలేబు, అబ్రాహాము, యోబు, దావీదు, ఏలియా, ఎలీషా, హతసాక్షులుగా నిలిచిన యేసుక్రీస్తుని శిష్యులు, పరిశుద్ధ తోమా, పేతురు, యాకోబు, యోహాను, అంద్రెయ, ఫిలిప్పు, బర్తొలొమయి, మత్తయి, యోహాను సోదరుడైన యాకోబు, మత్తీయ, జెలోతే అనబడిన సీమోను, సైఫను, పౌలు వంటివారు నేడు మనకు మార్గదర్శకులుగాను, వీరి సాక్ష్యములు మన ఆత్మీయ అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి.

నూతన నిబంధనలో అనగా ప్రస్తుత కాలంలో కూడా యధార్థంగా దేవుని సేవను జరిగిస్తున్న అపోస్తలుల (మిషనరీలు) జీవితములను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**01. బర్తొలొమయి (1682-1719):-** భారతదేశానికి ప్రొటెస్టెంట్ మిషనరీ మొదటి తమిళ నూతన నిబంధన అనువాదం చేసాడు. 'జిగెన్ బాగ్' ఆసియాలోనే మొట్టమొదటి ముద్రణాయంత్రం తమిళనాడుకు తెచ్చారు. తమిళంలో మొట్టమొదటి నిఘంటువు, అనేకమైన వ్యాకరణ గ్రంథాలు, మొట్టమొదటి క్యాలెండరు, మొట్టమొదటి కీర్తనల పుస్తకం క్రైస్తవలోకానికి అంకితమిచ్చారు. మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించారు.

**02. విలియం కేరీ (1760-1834):-** ఆధునిక మిషనరీ పితామహుడు. వృత్తిరీత్యా చెప్పులు కుట్టేవాడు. సిరంపూర్ యూనివర్సిటీ స్థాపకుడు 1800 సం॥ నూతన నిబంధనను 40 భాషలలోకి అనువదించారు. పూర్తి బైబిల్‌ను 20 భాషలలోకి అనువదించాడు. భారత దేశానికి మొట్టమొదటి పొగయంత్రాన్ని తెచ్చి ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో ఉపయోగించారు. ఆసియాలోకెల్లా మొట్టమొదటి వార్తాపత్రికను ప్రచురించాడు. భారత దేశంలో మొట్టమొదటి బొటానికల్ సొసైటీని స్థాపించాడు. సతీ సహగమన నిషేధంలో పాత్ర వహించాడు.

**అతని నినాదం :-** దేవుని నుండి గొప్ప కార్యాలకై ఎదురుచూసేముందు దేవుని కొరకు గొప్ప కార్యాలను చేపట్టు.

**03. హెన్రీ మార్టిన్ (1781-1812):-** హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో బైబిల్ అనువాదకుడు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువుకున్నాడు. గణితంలో బంగారు పతకం పొందుకున్నాడు. హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో ప్రావీణ్యుడు. స్త్రీలకోసం ప్రత్యేక పాఠశాలను ప్రారంభించాడు. భిక్షగాళ్ళకు సువార్తను పంచారు.

**04. అలెగ్జాండర్ డఫ్ (1806-1878):-** భారతదేశంలో మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించాడు. అగ్రకులాలకు చెందిన స్త్రీలకు ప్రత్యేక పాఠశాలను స్థాపించాడు. ఆనాటి సాంఘీక దురాచారాల గురించిన అవగాహన ప్రజల్లో కలిగించాడు.

**05. విలియం గౌడీ (1857-1922):-** బీదలకోసం, అణగారిన ప్రజలకోసం పోరాడాడు. తమిళనాడులోని తిరువేళ్ళురులోను చుట్టు ప్రక్కల దళితులకు స్వేచ్ఛను సాధించి పెట్టాడు. మౌళిక విద్య, గ్రామీణ పాఠశాలలు, సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ, ఇవన్నీ అతని సువార్త విధానాల సమగ్ర దృక్పథంలోని భాగాలే.

**06. పండిత రామాబాయి (1858-1922):-** ముక్తి మిషన్ స్థాపకురాలు. ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబములో జన్మించింది. సంస్కృతంలోను, హిందూ మత గ్రంథాల్లోనూ ప్రావీణ్యత పొందింది. విధవరాండ్రైన స్త్రీల పోషణకు, విద్యా బోధనకు శారదా సదన్ స్థాపించింది. పూనాలోని కేద్‌గావ్‌లో ముక్తి మిషన్‌ను నెలకొల్పింది.

**07. ఎమ్ విల్సన్ కార్మైకల్ (1867-1951):-** దేవదాసీల పిల్లలకు ఆదరణనిచ్చింది. చిన్న బాలికల కోసం దొనాపూర్‌లో ఆశ్రమం స్థాపించింది. తమిళనాడులో 60 సంవత్సరాలపాటు పరిచర్య చేసింది. తన స్వదేశానికి ఒక్కసారి కూడా తిరిగి వెళ్ళలేదు.

**08. ఇడా సోఫియాస్కడ్డర్ (1870-1960):-** సి.యం.సి స్థాపకురాలు. గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలను స్థాపించింది. స్త్రీల కోసం నర్సింగ్ కళాశాలను ప్రారంభించింది. వెల్లూరులోని క్రిష్టియన్ మెడికల్ కాలేజీ మరియు హాస్పిటల్ సి.యం.సి స్థాపకురాలు.

**09. ఇస్టాన్లీ జోన్స్ (1884-1973):-** సువార్తికుడు మహాత్మా గాంధీకి స్నేహితుడు. క్రైస్తవ ఆశ్రమాలు స్థాపించాడు. సమాజ ప్రయోజనకరమైన క్రైస్తవేతర విధానాల్లో సువార్తను అందించాడు.

**10. సాధుసుందర్‌సింగ్ (1889-1929):-** రక్తం స్రవించే పాదాల అపోస్తలుడు. పంజాబులో ఒక సిక్కు కుటుంబంలో జన్మించాడు. భారతదేశం, టిబెట్, నేపాల్, ఆఫ్ఘనిస్థాన్

దేశాల్లో సువార్తను వ్యాపింపజేశాడు. క్రీస్తు వంటి అతని శ్రమలు ప్రపంచాన్ని... కుదిపేశాయి.

**11. మదర్ థెరిస్సా (1910-1997):-** అనాధల తల్లి. కలకత్తాలో చావసిద్ధంగా ఉన్నవారి కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించింది. వృద్ధులకు ఒక ఆశ్రమం స్థాపించింది. భారత దేశమంతటా కుష్టువ్యాధిగ్రస్తుల కోసం 81 ఆశ్రమాలు ప్రారంభించి వారికి వైద్యం చేసింది. నోబెల్ బహుమతి మొ॥ అనేక అవార్డులు అందుకుంది. ఆ బహుమానాలు పొందటానికి కారణం యేసుక్రీస్తుని ప్రేమే.

క్రీస్తుని విశ్వసించిన నాటినుండి నేటి వరకు మనము దేవునిలో జీవించిన దినములు లేక సంవత్సరములు ఎంతమందిని ప్రభావితం చేసాయి అనేది మనము చూసుకొనవలసిన అవసరం ఉంది. పైన వ్రాయబడిన భక్తుల జీవితములు ఎంతో మందిని దేవుని కొరకు జీవించడానికి ప్రోత్సాహపరచుచున్నాయి. క్రియలు లేక ఫలములు అనేవి జీవితములో ఏ మాత్రం లేకుండా కేవలం అది మంచిది, ఇది చెడ్డది అని తీర్పులు తీర్చుతూ **"పనికిమాలిన జ్ఞానముతో ఎవరికీ పనికిరాని విశ్లేషణలు చేయడం చెక్కగుర్రం మీద కూర్చుని ఎంతో దూరం ప్రయాణించాము అని భ్రాంతి చెందడం లాంటిది."** తమకు తామే గొప్పవారిగా భ్రమపడుతూ ఎదుటి వారిని భ్రమపరచాలని చూసే వారు ఉన్నట్టా, లేనట్టా.... (లేక) ఉండీ లేనట్టా ......

## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన - 2012, మే 1వ తేది (మంగళవారం)**
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును
ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

వివరములకు: 9666666249
040-24202227

# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 21వ భాగము**



అచ్చుటి ప్రజల ఆహారపు అలవాట్లను తాను అలవర్చుకోవాలి. వేయించి దంచిన బార్లీ, పులిసిన వెన్న వారి ముఖ్యాహారము. టీలో ఉప్పు వేసుకుంటారు. ఈ భోజనం అంత సులువుగా జీర్ణం కాదు. సుందర్ దృష్టిలో వీటన్నిటి కంటె ఇంకా ఘోరమైన విషయమేమిటంటే టిబెట్ వారు అసలు స్నానం చేయరు. వారి ముఖము, చేతులు మురికిగా ఉండేవి. చలికి తట్టుకోవడానికి పులిసిన వెన్న పూసుకునేవారు. దానితో వారి శరీరం నుండి దుర్గంధం వస్తుండేది. అయితే వారి మతమునకు భిన్నమైన మతమును ప్రకటించడానికి సుందర్ వచ్చాడని తెలిసికొన్నప్పుడు అంతకు ముందు వారు చూపిన తీవ్రమైన ఆసక్తి కాస్తా కోపంతో కూడిన ద్వేషంగా మారింది. వీరు తీవ్రమైన మత సాంప్రదాయులు అని తెలిసికోవడానికి సుందర్‌కి ఎంతో సేపు పట్టలేదు. విశాలమైన ఆ దేశంలో ఆ మూల నుండి ఈ మూలకు సాలెగూడు వలె వారిని బంధించిన లామాల పౌరోహిత్యానికి వారు సంతోషంగానే విధేయత చూపారు. విదేశీ శక్తులు తమ మతమును నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయనీ, తమ బలమంతటితో అలాంటి శక్తులను ఎదుర్కోవడానికి సిద్ధంగా వుండాలని అంతకు ముందే ప్రజలను వారు హెచ్చరించారు.

ఈ సువార్త యాత్ర కొద్ది వారముల్లోనే ముగిసింది. కాని సుందర్‌గాని, ఆయన సహచరుడు గాని ఎలాంటి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొనలేదు. వారి ప్రసంగాలు వినవద్దని లామాలు ముందుగానే ప్రజలను హెచ్చరించినందు వలన ఏవో కొన్ని కష్టములెదుర్కొన్నారు గాని, మిగిలినదంతా కరుకైన ఆ పర్వత ప్రాంతములలో ప్రయాణం చేసే ఎవరికైనా వచ్చే కష్టాలే. అయితే లామాలకు చెందిన ఒక ఆశ్రమం దగ్గర ఒక లామా వారిని పిలిచి వారు చెప్పదలచుకొన్నదాన్ని శ్రద్ధగా విన్నాడు. సుందర్ ఆయన సహచరుడు ఈ వింత పరిణామానికి ఎంతో విస్తుపోయారు. ఈ క్రొత్త స్థలంలో టిబెట్ వారి మధ్య నెమ్మదిగా తన సేవను ప్రారంభించాడు. టిబెట్ ప్రాంతపు సేవ ఆయన జీవితములో ప్రాముఖ్యమై పోయింది. అప్పటి నుండి భారత దేశంలో ఎన్నో గ్రామాలకు, పట్టణాలకు వెళ్ళినప్పటికిని హిమాలయ పర్వత ప్రాంతములలో మంచు కరిగే కాలమును సుందర్ ఎన్నడూ మరిచి పోయేవాడు కాదు. టిబెట్ వెళ్ళడానికి అదే సరైన సమయం. ప్రతి సంవత్సరం ఎంతో మంది వ్యాపారులు మరెంతో మంది యాత్రికులతో కలిసి

హిమాలయాలలోని మారుమూల ప్రాంతాలకు వెళ్ళడం ఆయన జీవితములోని ప్రధానమైనది కావడానికి ముందు అతని క్రైస్తవ్యమును పరీక్షించే ఓ సంఘటన చోటు చేసుకొని ఉత్తర భారతదేశంలోని క్రైస్తవ సంఘముల బలహీనతలు ప్రస్ఫూటంగా బయటపడ్డాయి. లాహొూర్‌లోని సెయింట్‌జాన్ వేదాంత కళాశాలలో విద్యార్థిగా చేరి సేవ నిమిత్తమై శిక్షణ పొందుచున్న సుందర్‌కు అనేక మంది యౌవనులతో సాంగత్యమేర్పడడం వలన వారి ఆత్మీయ జీవితములలో లోతులేని స్థితిని చూచి ఎంతో నిరాశపడిపోయాడు. వేదాంత విద్య నభ్యసించాలన్న కోరికతో గాక లాహొూర్‌లోని ఆంగ్లికన్ బిషప్ డా.లెఫ్రాయ్‌గారి మీద తనకున్న గౌరవాభిమానాలతో ఆ కళాశాలలో చేరాడు. ఒక ప్రసంగీకునిగా ఉండిన సంపూర్ణ సమర్పణను, ఇతరులపై అవి చూపించే గొప్ప ప్రభావమును ఆంగ్లికన్ సంఘములలో ప్రసంగిస్తే ఎంతో గొప్ప సేవ జరుగుతుందని లెఫ్రాయ్ భావించారు. వేదాంత శిక్షణతో బాటు పాదిరిగా అభిషేకిస్తే ఆంగ్లికన్ సంఘాలన్నింటిలో సువార్త ప్రకటించడానికి సుందర్‌కు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన భావించారు. డా.లెఫ్రాయ్‌గారు ఇంకా మరికొందరు పాశ్చాత మిషనెరీలు చేసిన తీర్మానములతో సుందర్ ఏకీభవించక పోయినప్పటికిని వేదాంత కళాశాలలో విద్యార్థిగా చేరడానికి సుందర్ అంగీకరించాడు. మిగిలిన విద్యార్థులతో బాటు మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాసి కృతార్థుడయ్యాడు. అయినప్పటికిని రెండవ సంవత్సరంలో కూడా కాషాయ వస్త్రాలను ధరించడం మాత్రం మానలేదు. ఆరంభం నుండీ కళాశాలలో ఆయనకు కష్టంగానే ఉంది. అతకు మునుపు తాను సిక్కు మతస్తుడు కావడం చేత మిగిలిన వారి కంటే భిన్నమైన వానిగా కనబడడం వలననూ ప్రత్యేకంగా ఉండేవాడు. వారిలో చాలమంది క్రైస్తవ గృహాలకే చెందినవారు కావడంతో క్రైస్తవేతరుల వలె స్వంత వారి నుండి దూరమై పోయి మిషనెరీల సహాయమును అర్థించిన వారు తక్కువ. ఇలాంటి వారి మధ్యకు సాధూజీ వలె కాషాయ వస్త్రములు ధరించి ఓ సాధువులాగే జీవించాలని కోరుచున్న ఒకడు రావడంతో ఎన్నో విమర్శలు రావడమే గాక కొందరు శత్రువుల్లా కూడా ప్రవర్తించారు. ఏకాంత ప్రార్థనకై ఎన్నెన్నో గంటలు సుందర్ బయటకు వెళ్ళిపోవుచుండడంతో కొందరికి ఏమీ అర్థం కాలేదు. మరి కొందరైతే ఎంతో చికాకు పడ్డారు. సుందర్ ఆసక్తిని చూచినపుడు వారికది అసాధారణమైనదిగా కనబడింది. ఒక విద్యార్థి తన అయిష్టతను బాహాటంగానే వెల్లడించాడు. వారు తన యెడల ప్రవర్తించిన తీరుకు సుందర్ ఆశ్చర్యపడడమే గాక దిగులు పడ్డాడు కూడ. నాలో ఏదైనా పొరబాటుందేమో, నాకు తెలియకుండానే ఏదైనా తప్పు చేశానేమోనని తనను తానే ప్రశ్నించుకొనేవాడు సుందర్.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

# ఎక్కువ - తక్కువ వద్దు



పిల్లలూ మీలో కొంత మంది గలగల మాట్లాడుతూ ఉంటారు. మరికొంత మంది మౌనంగా ఉంటారు, ఇంకొంత మంది ఎదుటి వారి మెప్పు కొరకు ఉన్న దానికి కొంత కలిపి, కొంత తీసివేసి చెబుతూ ఉంటారు.

చాలా సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటన బైబిల్‌లో వ్రాయబడి ఉంది. పిల్లలూ! శ్రద్ధగా చదువుతారు గదా! ఇశ్రాయేలీయులలో ప్రముఖుడు, యోగ్యుడైన ఒక రాజు తన సైన్యంతో కలసి ఒక యుద్ధానికి వెళ్ళాడు. ఆయన కుమారులు కూడా వెంట వెళ్ళారు. యుద్ధం హోరాహోరీగా జరుగుతుంది. రాజు యుద్ధంలో మరణించాడు. నిజానికి ఆయన్ని ఎవరూ చంపలేదు. శత్రువుల చేతిలో చిక్కుతాడని అనిపించినప్పుడు తన ఖడ్గంపై తానేపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూచిన అతని అనుచరులు కూడా అదే పని చేశారు. ఈ సంఘటన చూసిన ఒక యువకుడు ఒక్క ఉదుటున దావీదు యొద్దకు వెళ్ళాడు. రాజుకు దావీదు ప్రధమ విరోధి అని సైనికుడికి ముందే తెలుసు. ఆ కుర్రాడు దావీదు దగ్గరకు వెళ్తూ వెళ్తూ రాజుగారి కిరీటము కూడా తీసుకెళ్ళాడు.

వాడు దావీదు నొద్దకు పరిగెత్తుకు వెళ్ళి సాష్టాంగ పడ్డాడు. తాను యుద్ధభూమి నుండి వస్తున్నాడని, రాజు యుద్ధంలో ఓడిపోయాడని, శిరచ్ఛేదనము చేసి కిరీటము తీసుకువచ్చానని, ఆ యువకుడు దావీదుతో చెప్పాడు. దావీదు నుండి మెప్పు పొందడానికి ఆ యౌవన సైనికుడు ఆ విధంగా చెప్పాడు. దావీదు ఆ వార్త విన్న వెంటనే సంతోషించలేకపోయాడు. సాధారణ నాయకులు, రాజులు చేయు విధంగా బిరుదులతో, పతకాలతో, గౌరవ వందనాలతో అవార్డులు, బహుమానాలతో సత్కరించవలసినది పోయి తలనరికించాడు.

2 సమూయేలు 1:14-16 వరకు ఉన్న వాక్యములు. **"అందుకు దావీదు - భయపడక యెహోవా అభిషేకించిన వానిని చంపుటకు నీవేల అతని మీద చెయ్యి ఎత్తితివి? యెహోవా అభిషేకించిన వానిని నేను చంపితినని నీవు చెప్పితివే. నీ నోటి మాటయే నీ మీద సాక్ష్యము గనుక నీ ప్రాణమునకు నీవే ఉత్తరవాదివని వానితో చెప్పి తన వారిలో ఒకని పిలిచి - నీవు పోయి వాని చంపుమనగా అతడు వానిని కొట్టి చంపెను."** దావీదును మెప్పించుటకు

వాడు దానికి ఇంకా కొంత చేర్చి చెప్పినందుకు తగిన శిక్ష లభించింది.

లోకంలో మాటలు అనేవి ప్రతి నిత్యం ఎంతో మన జీవితములపై ప్రభావమును చూపిస్తూ ఉంటాయి. మాటల ద్వారానే మమతానురాగాలు, వాటి ద్వారానే మారణహోమాలు జరుగుతూవుంటాయి. నోరు మంచిదైతే ఊరు మంచిది అని అంటారు. బాల్యము నుండి మాటల విషయంలో జ్ఞానము కలిగి ఉంటే పెరిగి పెద్దవారైన తరువాత ఎటువంటి సమస్యలు లేకుండా జీవించగలుగుతారు.

పిల్లలూ! మీరు చిన్నవయస్సులోనే ఇలాంటి వాటి గురించి జాగ్రత్త తీసుకోవలసి ఉంది. ఎందుకంటే మనము ఇంటిలో తల్లిదండ్రులనుండి, టీచర్స్ నుండి మాటలు నేర్చుకునే అవకాశం ఉంది. ఒకవేళ వారు మాట్లాడే మాటలలో కొన్నింటిని జోడించి, మరికొన్నింటిని కత్తిరించినప్పటికి మీరు అలా నేర్చుకోకండి. మీరు ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతూ జీవించాలని నా హృదయపూర్వకమైన ఆశ.

**- ఎడిటర్**

## ముఖ్య గమనిక:


మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 9666666249 | 040-24202227
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# "నా జీవితములో దేవుని మేలులు"

- కె. శ్రీనివాసరావు, విజయవాడ

కట్టుకోవడానికి బట్టలు సరిగా లేక ఎన్నో ఇబ్బందులు పడుతూ, చిన్నవయసులోనే కూలిపనులు చేస్తూ, షెడ్డులో పని చేసేటప్పుడు చెప్పులు లేక కాళ్ళు కాలుతూ ఉంటే, చెక్కముక్కలు కాళ్ళ క్రింద పెట్టుకొని పనిచేసే వాడిని. ఇలాంటి పరిస్థితులలో నుండి దేవుడు నన్ను ఏ విధంగా రక్షించారో నా సాక్ష్యమును మీతో పంచుకుంటున్నాను.

నా పేరు శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా విజయవాడలోని పటమలంక అను ప్రాంతములో విగ్రహారాధన కుటుంబములో పుట్టాను. నాకు ఒక తమ్ముడు. రోజూ కూలిపనులు చేసుకుంటే కానీ పూట గడవని పరిస్థితి. కూలికి వెళ్ళని రోజు తినడానికి ఆహారం ఉండేది కాదు. ఈ విధమైన పరిస్థితులలో మా నాన్నగారికి తీవ్రమైన అనారోగ్యం కలిగింది. ఒకరోజు పనికి వెళ్తే నాలుగు రోజులు చేయలేక వెళ్ళేవారు కాదు. ఎంత మంది డాక్టర్స్ దగ్గర ఎన్ని ప్రయత్నములు చేసిననూ స్వస్థత కలుగలేదు. ఆ సమయములో మా నానమ్మగారు యేసుప్రభువు దగ్గరకు వెళ్తే స్వస్థత కలుగుతుందని చెప్పడం వలన మేము దేవుని సన్నిధిలో మొరపెట్టుకున్నాము. అక్కడ ఉన్న సంఘస్తులు, సేవకులు ప్రార్థించుట ద్వారా దేవుడు మా నాన్నగారిని దర్శించి స్వస్థపరుచుట ద్వారా ఇంట్లో ఉన్న విగ్రహములన్నిటిని తీసివేసి, ప్రార్థన చేసుకోవడం మొదలుపెట్టాము. క్రమంగా మా పరిస్థితి కూడా మెరుగయ్యింది. మా చుట్టుప్రక్కల వారు ఆ దేవుణ్ణి మీరు ఎందుకు నమ్ముకున్నారు అని ఎగతాళి చేసేవారు. నేను కూడా దేవుడు తెలుసు అన్నట్లుగా నామకార్థంగా జీవించేవాడిని కాని, విశ్వాసంతో ఉండేవాడిని కాను.

ఈ విధంగా జీవిస్తూ, 1994 సంవత్సరములో హైదరాబాద్‌లోని వనస్థలిపురం అనే ప్రాంతమునకు వచ్చి మెకానిక్‌గా పని చేసేవాడిని. చేస్తూ, వేరొక సంఘమునకు వెళ్తూ, అక్కడే నేను రక్షించబడి, బాప్తిస్మము కూడా తీసుకోవడం జరిగింది. అయిననూ నా జీవితములో మార్పు అనేది లేకుండా నామకార్థంగా చర్చికి వెళ్ళేవారము అంతే కానీ హృదయపూర్వకంగా వెళ్ళేవారము కాము. ఆ తరువాత కొద్దిరోజులు కొంతమంది ప్రవర్తి స్తున్న ప్రవర్తన, వారి జీవిత విధానములు నచ్చక చర్చికి వెళ్ళడమే మానివేశాను. అంతే కాక త్రాగుడు అనే వ్యసనముతో కూడా జీవిస్తూ ఉండేవాడిని.

ఈ విధమైన పరిస్థితులలో మన ఎపఫ్రా మినిస్ట్రీస్‌కు వచ్చే ఒక తల్లిగారు ప్రార్థనకు రమ్మని చెబుతుంటే వినేవాడిని కాను. నేను చాలామందిని, చాలా సంఘములను చూచాను,

అందరూ ఇంతే అని చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి, వెళ్ళేవాడిని కాదు. ఒకరోజు ఆవిడ బలవంతం చేయడం ద్వారా భాగ్యలత కాలనీలో శనివారం సాయంత్రం జరిగే ఉపవాస ప్రార్థనకు వెళ్ళాను. చర్చిలో కూర్చునే విధానములోని క్రమము, నిశ్శబ్దముగా వాక్యమును వినుట, దైవసేవకులు చాలా సింపుల్‌గా ఉండడం మొట్టమొదటిసారిగా అక్కడికి వెళ్ళిన నన్ను చాలా ఆకట్టుకున్నాయి. ఈ విధంగా శనివారం ప్రార్థనలకు వస్తూ ఉండడం ద్వారా దేవుడు వాక్యం ద్వారా నాతో మాట్లాడి నాలో ఉన్న త్రాగుడు అనే బలహీనత నుండి విడిపించారు. అంతేకాక దేవుని వాక్యము విని, అనుసరించాలి అనే ఆశ కూడా నాలో కలుగుతూ వచ్చింది. విశ్వాసము కూడా కలిగింది.

తరువాత క్రమంగా ఆదివారం ఆరాధనలకి, ప్రతినెల జరిగే ఉపవాస ప్రార్థనలలో పాల్గొనడానికి దేవుడు సహాయం చేశారు. అయితే నాకు కన్నీటి ప్రార్థన అనేది అస్సలు రాదు. కన్నీటితో ప్రార్థించేవారిని చూచి వీళ్ళు ఎందుకు ఇలా ఏడుస్తారు ? ఇదంతా నటించడమే అని ఆలోచించుకునేవాడిని. కానీ ఒక ఉపవాస ప్రార్థన (ఆగస్టు 15)లో దేవుడు నన్ను తాకడం ద్వారా ఆయన సన్నిధిలో కన్నీటితో ప్రార్థించుకోవడం జరిగింది. అంత మాత్రమే కాక ఈ ఉపవాస ప్రార్థనల ద్వారా మాత్రమే నేను దేవునిలో చాలా బలపడ్డాను.

ఎంతో ఘోరమైన నా ఆర్థిక పరిస్థితిని మార్చి ఏదీ తక్కువ కాకుండా సమృద్ధిని కలుగజేసి నామకార్థస్థితి నుండి విడిపించి, ఆత్మీయ జీవితంలో ఆయనలో నిలిచి ఉండే విధంగా కృపతో నింపి నడిపించిన దేవునికి ఎన్ని స్తుతులు చెల్లించిననూ ఋణస్తులమే. నాకు ఇద్దరు పాపలు, ఒక బాబు. నేను, నా కుటుంబము దేవుని సన్నిధిలోనే నిలిచి ఉండునట్లుగా మా కొరకు ప్రార్థించగలరు.



# ఆహారపు అలవాట్లు, శరీర పోషణ

శరీరం గురించి తగినంత శ్రద్ధ తీసుకోకపోతే అనారోగ్యం ప్రాప్తిస్తుంది. ఇది జరిగినప్పుడు శరీరమునకు భౌతికస్వస్థత కావాలి. అంతే కాక ఇకపై శరీరమునకు తగిన సంరక్షణ, భద్రత ఉండే విధంగా కొన్ని చర్యలు కూడా అవసరం. తినే ఆహారం, త్రాగే నీరు, పీల్చేగాలి కలుషితమైన సమాజములో మనం జీవిస్తున్నాము కనుక ఆహారపు అలవాట్లు, మరియు ఆరోగ్య సూత్రముల గురించి తప్పక మనం తెలుసుకోవలసిన అవసరం ఉన్నది.

ఒక వ్యక్తి పోషకాహార లోపం వలన అంటే సరియైన తిండి లేక బాధపడుతున్నాడనుకొండి దీనికి ఒకటే మందు, ఆహార పరిస్థితి మెరుగుపడాలి. ఎవరికి చేతనైనంత మేరకు వారు తాము తీసుకునే ఆహారం సమతూకంగా పోషక విలువలు కలిగి, మంచి ఆరోగ్యమునకు అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లతో కూడి ఉండేలా చూచుకోవాలి. కరువు పరిస్థితులలో మనుష్యులు ఆరోగ్యంగా ఉండేందుకు కావలసిన వైవిధ్యం కలిగిన ఆహార పదార్థాలు లభ్యం కావడం అసాధ్యమవుతుంది. అయితే ఆహారం పుష్కలంగా దొరికే వారు సైతం, పోషకాహార విలువల గురించి కొన్నిసార్లు పట్టించుకోరు.

సరైన తిండి తినేందుకు డబ్బు ఖర్చు పెట్టడానికి ఎంతో మంది వెనకా ముందు ఆలోచించి, పిసినితనముతో జీవిస్తూ, మన తాహతుకు మించిన పని అని సమర్థించుకుంటారు. మన సమాజములో వెండి బంగారములకు ఉన్నంత విలువ కూడా సరియైన ఆహారమునకు లేకపోవడం శోచనీయమైన విషయం. దురదృష్టవశాత్తు అలాంటివారు అనారోగ్యముల పాలైతే ఆస్పత్రులకు, డాక్టర్లకు, మందులకు డబ్బు ఖర్చు పెట్టడమే కాక మానసికంగాను, శరీరపరంగాను ఎంతో బాధను అనుభవించవలసి వస్తుంది. దీని కంటే సరియైన ఆహారం కోసం ఖర్చు పెట్టడం ఎంతో నయం.

**1. పోషకాహారం:-** మంచి ఆరోగ్యం ఉండాలంటే మానవ దేహమునకు 4 రకాల ఆహార పదార్థములు అవసరం

**అ. ప్రోటీన్లు :-** చేపలు, కోడిమాంసం, చిక్కుళ్ళు మరియు పప్పులు

**ఆ. కూరగాయలు:-** కేరెట్లు, ఆకుకూరలు, బఠాణీలు, మొక్కజొన్న, మొలకెత్తిన పప్పుధాన్యములు, బంగాళదుంపలు అందుబాటులో ఉన్న కూరగాయలన్నీ ప్రతిరోజూ మన ఆహారంలో భాగంగా చూసుకోవాలి.

**ఇ. పండ్లు:-** నారింజ, ద్రాక్ష, ఆపిల్, టొమేటో, మామిడి, అరటి, అనాస తదితర పండ్లు

**ఈ. ధాన్యములు:-** గోధుమ, బియ్యం, బార్లీ, మొదలైనవి (తెల్లగా మరపట్టిస్తే పోషక పదార్థములన్నీ పోతాయి. సాధ్యమైనంత వరకు ఇవి గోధుమ వన్నెలోనే ఉండాలి). ధాన్యం నుండి తయారు చేసిన పదార్థములు ఉదా: రొట్టె మరియు అన్నము కనీసం రెండుసార్లు

## 2. అలవాట్ల శుభ్రత:-

మరోవైపున అవసరమునకు మించి తినడం లేక అనవసరమైన పదార్థములను అతిగా తినడం ద్వారా తమ ఆరోగ్యమును పాడు చేసుకునేవారూ ఉన్నారు. కొవ్వుపదార్థములు, పిండి పదార్థములు తింటారు. శక్తికి బదులు శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇలాటి వారు స్థూలకాయులౌతారు. అందువలన ఆరోగ్యం దెబ్బ తింటుంది.

ఈ రోజులలో చాలామంది "తమ పళ్ళతో తమ గొయ్యి తామే తవ్వుకుంటున్నారు" అనే మాటని నిజం చేస్తున్నారు. వారి ఆహారపు అలవాట్లు అనారోగ్యమును, శీఘ్రమరణమును తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి విషయములలో క్రమశిక్షణ అవసరం. మన దేహములు ఇక మనవి కావు. వెల ఇచ్చి కొనబడినవి. ఇప్పుడు అవి దేవునికి చెందినవి. వాటిని జాగ్రత్తగా చూచుకోవడం ద్వారా మనం దేవునిని మహిమపరచాలి **(1 కొరింథీ 6:20)**

అలాగే సరియైన పరిశుభ్రత కూడా అవసరమని గుర్తుంచుకోవాలి. శరీరమును శుభ్రం చేసుకోవడం తినే పాత్రలను శుభ్రంగా ఉంచుకోవడం తప్పనిసరి. మిగిలిపోయిన ఆహార కణములపై రోగ క్రిములు పెరుగుతాయి. **"దైవభక్తి తరువాత అంతటి స్థానం పరిశుభ్రతది"** అనే సామెతలో చాలా నిజం ఉంది. రోజుకి కనీసం ఒకసారి చక్కగా స్నానం చేయాలి అన్నది మంచి నియమం. **"అప్పుడు నేను నీళ్ళతో నిన్ను కడిగి" - యెహె 16:9, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారమై విశ్వాస విషయమై సంపూర్ణ నిశ్చయం గలిగి ..... హెబ్రీ 10:22**

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు, ప్రసంగముల సి.డి.లు**
**కావలసినవారు ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు.**

మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227, సెల్: 9666666249

# ప్రార్థన - ఊపిరి పీల్చుట వంటిదే

ఆత్మచే నడిపింపబడే ప్రార్థన ఎలా ప్రార్థించాలి అనే దానికి ఒక ఉదాహరణ ఉంది. మీ ఇంటిలో ఇద్దరు తిరుగుబాటు చేసే యౌవనస్థులైన పిల్లలు ఉన్నారనుకుందాము. ప్రార్థన చేసేటప్పుడు కానీ, దేవుని గురించి వారికి చెప్పేటప్పుడు కానీ వారు చేసే అల్లరికి గట్టిగా అరవాలనిపిస్తుంది అనుకుందాము. అప్పుడు నువ్వు ఎంత బాధపడుతున్నావో దేవునికి ఫిర్యాదు చేస్తావు. ప్రార్థించిన తరువాత కూడా ఆ పిల్లలను తిట్టి, వారు ఎంత భయంకరముగా ఉన్నారో చెప్పి, మీ జీవితములు ఎందుకు పనికిరావు అని కోపంతో ప్రవర్తిస్తావు. ఒకవేళ ఇదే గనుక ఇంట్లో జరుగుతూ ఉంటే మీ ఇల్లంతా పోట్లాటలతో నిండి ఉంటుంది, ఎప్పటికి సమాధానం ఉండదు. కుటుంబములో ప్రతి ఒక్కరూ ఎప్పుడూ కోపంగా, అసంతోషంగా ఉంటారు. మన ప్రార్థనా సమయం నిజమైన ప్రార్థన కంటే "ఫిర్యాదుల భాగంగా" మారుట చాలా సులువు.

ఫిర్యాదులన్నిటితో ఆయన వద్దకు పరిగెత్తుటకు బదులుగా ఆ పరిస్థితిని గురించి దేవుని ఆత్మచే ప్రార్థనలు చేయుట ప్రారంభిస్తే గొప్ప మార్పును చూడవచ్చు. "ఆత్మతో చేసే ప్రార్థన" ఈ విధంగా ఉంటుంది. "దేవా, ఈ రోజు ఈ యౌవనస్తులతో చాలా విసిగిపోయాను. అయితే కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము, గర్భఫలము బహుమానమని మరియు వారు బలవంతుని చేతిలో బాణముల వంటి వారని నీ వాక్యము చెప్తుంది. వారి సమాధానము గొప్పది అని కూడా నీ వాక్యం చెప్తుంది. కాబట్టి దేవా, కృతజ్ఞతతో నీ ఎదుటికి వచ్చియున్నాను. నా పిల్లలతో ప్రవర్తించుటకు నాకు జ్ఞానమును దయచేయండి. ప్రభువా వారి పరిస్థితులు నాకు అర్థమయ్యేటట్లు చేయండి. వారికి సహాయపడగల సమర్థతను నాకు దయచేయండి. వారిని గురించి నీ ప్రేమను నా హృదయంలో క్రుమ్మరించు, నీ ప్రేమ నాలో సమృద్ధిగా ఉండునట్లు చేయుమని నీ కృప నాలో ప్రవహించునట్లు చేయమని, నాహృదయం నీ యెదుట, నా కుటుంబంపట్ల సరియైనదిగా ఉండునట్లు చేయమని ప్రార్థిస్తున్నాను. క్రీస్తు సమాధానము నా కుటుంబములోనూ రాజ్యమేలును గాక".

పైన ఉదాహరణ ప్రకారముగా ప్రార్థించినట్లయితే కోపం మాయమవుతుంది. యౌవనస్తులను దేవుని ప్రేమతో ప్రేమించుట మొదలుపెట్టి, కుటుంబములో సమాధానమును స్థాపించుకోగలము. ప్రతి పరిస్థితిలో దేవుడు పనిచేయుట మొదలుపెడతారు, ఎందుకంటే మనం మన పరిస్థితుల గురించి ఉద్రేకపూరితమైన

ప్రార్థనలు చేయుట ఆపివేస్తాము, ఆయన మనకి ఇచ్చిన బిడ్డల గురించి ఫిర్యాదు చేయుట, గొణుగుట మానివేశాము. ఆయనకు అత్యంత ముఖ్యమైన విషయమును గురించి హృదయస్థితిని గురించి ప్రార్థించుట మొదలుపెట్టాము.

మనకు ప్రార్థన నేర్పించుటలో దేవుడు ఉపయోగించు మార్గములలో ఒక భాగము పరిశుద్ధాత్మను అనుసరించుటకు సహాయపడుట. అనుమానమునకు తావు లేకుండా, దేవునికి ప్రార్థించుటకు అతి ప్రభావవంతమైన మార్గము పరిశుద్ధాత్మ మనలను నడిపించనీయుటయే. అది మన మనసులలో కాక దేవుని హృదయములో నుండి వచ్చిన విషయములను గురించి ప్రార్థించుటకు మన హృదయములో వాటిని ఉంచమని ప్రభువుని అడుగుతూ ఆయన ఎదుట వేచి ఉండుట వలన సాధ్యము. ఏమి ప్రార్థించాలని ఆలోచించుట, పెద్దగా శబ్దం చేయు ప్రార్థనలు చేయుటకు ప్రయాసపడుట అలసట నిస్తుంది. శరీరములో ఈ విధమైన కష్టము ఫలవంతమైనది కాదు. మన ప్రార్థనలు ప్రభావవంతముగా లేనప్పుడు, ఆత్మీయంగా ఏమీ సాధించలేనప్పుడు మన మనస్సు మనలను సమర్థించుకొనేటట్లు చేసినా – మన ఆత్మలకు మాత్రం తెలుస్తుంది.

పరిశుద్ధాత్మ నడిపింపు అడుగుతూ మన ప్రార్థనలు ప్రారంభించినట్లయితే మనం ఒకే విషయం, లేదా ఒకే వ్యక్తుల గురించి ప్రార్థించము గనుక మనకు విసుగనిపించదు. స్పష్టంగా లేకపోయినట్లయితే ప్రార్థన విసుగనిపిస్తుంది. ఆయన నడిపించునప్పుడు మన ప్రార్థనలు ఆచారబద్ధంగా ఉండవు. మనం కేవలం దేవుని హృదయమును ఎరిగి మన సంభాషణ తాజాగా, స్పష్టంగా ఉండునట్లు పరిశుద్ధాత్మ సహాయం పొందుకోవాలి. మన ప్రార్థనలను పరిశుద్ధాత్ముని నడిపింపునకు అప్పగించుట అనేది మన జీవితములకు గొప్ప స్వేచ్ఛను తీసికొని వచ్చి ప్రార్థనను మరింత సులువుగాను, సంతోషకరంగాను చేస్తుంది. ప్రతి వ్యక్తి దేవుడు ప్రార్థించమన్న విషయముల గురించి ప్రార్థించుటకై పరిశుద్ధాత్ముని నడిపింపునకు లోబడినట్లయితే ప్రపంచం మొత్తం గురించి ప్రార్థనలు చేయబడతాయి.

మనం పరిశుద్ధాత్ముని నడిపింపును అనుసరించి ఆయన దేని గురించి ప్రార్థించమంటాడో ఎంతసేపు ప్రార్థించమంటాడో ఎరిగి ప్రార్థించవలసి యున్నది. మన ఆత్మీయ చెవులు ఆయన వైపు తిరిగి ఉన్నప్పుడు ఆయన సూచనలను, ప్రోత్సాహమును వినగలము. ఆయనకు అవసరమైనదేదో ఎరిగి ఆయన మనలను ప్రార్థింపగోరిన మార్గములో ఖచ్చితంగా ప్రార్థించగలము – అది ఎల్లప్పుడు అద్భుతకరమైన ఫలితముల నిస్తుంది.



# అర్నోను నది

ఇది ఒక లోయలోని నది పేరు. మృతసముద్రమునకు తూర్పుగా ఉండు కొండలలో నుండి ప్రవహించి, సముద్రములో కలియును. మొదట ఈ నది దక్షిణమున ఉండు మోయాబీయులకును ఉత్తరముగా ఉండు అమోరీయులకును సరిహద్దుగా ఉండేది. ఇశ్రాయేలు ప్రజలు ఐగుప్తు దాసత్వం నుండి విడిపించబడి, మోషే నాయకత్వంలో కనాను ప్రయాణ మార్గములో అమోరీయుల పొలిమేరల నుండి ప్రవహించి, అరణ్యమందు సంచరించు అర్నోను అద్దరిని దిగిరి. అప్పుడు ఇశ్రాయేలీయులు అమోరీయుల రాజైన సీహోను వద్దకు దూతలను పంపి - మమ్మును మీ దేశములో బడి వెళ్ళనిమ్ము. మేము పొలములకైనను ద్రాక్షతోటలకైనను పోము. బావుల నీళ్ళు త్రాగము. మేము మీ పొలిమేరలను దాటు వరకు రాజమార్గములోనే నడిచిపోదుమని అతనికి చెప్పించిరి. అయితే సీహోను ఇశ్రాయేలీయులను తన పొలిమేరలను దాటనియ్యలేదు మరియు ఇశ్రాయేలీయులను ఎదుర్కొనుటకు అరణ్యములోనికి వెళ్ళి, యాహజుకు వచ్చి ఇశ్రాయేలీయులతో యుద్ధము చేసెను. ఇశ్రాయేలీయులు వానిని కత్తివాత హతము చేసి, వాని దేశము వరకు స్వాధీనపరచుకొనిరి. ఆ విధంగా అర్నోను నది ఇశ్రాయేలీయుల రాజ్యమునకు, మోయాబీయుల రాజ్యమునకు మధ్య సరిహద్దు అయ్యింది. ప్రస్తుతము దానికి వాడిమోజిబ్ అని పేరు. ఇది చాలా చక్కని ప్రదేశముగా, అనేక విధములైన పూల చెట్లతో అలంకరింపబడి యుండును.




# బైబిల్ క్విజ్ -21

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1. సమస్త కీడులకు మూలం ఏది?**

**2. మిలేతులో రోగియైనందుకు పౌలు ఎవరిని అక్కడ విడిచిపెట్టాడు?**

**3. తిమోతి తల్లి ఎవరు?**

**4. ఈ లోకమును ప్రేమించి పౌలును విడిచిపెట్టినది ఎవరు?**

**5. పౌలు త్రోయలో ఎవరి వద్ద తన అంగీని, పుస్తకాన్ని, చర్మపు కాగితాన్ని ఉంచాడు?**

**6. ఏ సంఘంలో పౌలు రాత్రింబగళ్ళు కష్టపడి దేవుని సువార్తను ప్రకటించాడు?**

**7. పరలోకం నుండి ప్రభువు దిగివచ్చునప్పుడు మొదట లేచేది ఎవరు?**

**8. విశ్వాసమును బట్టి పౌలుకు నిజమైన కుమారుడెవరు?**

**9. 'దైవజనుడా' అని పౌలు ఎవరిని సంభోధించాడు?**

**10. విశ్వాస, సత్యముల విషయమై అన్యజనులకు బోధకునిగా నియమించబడిన అపోస్తలుడు ఎవరు?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2012 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్ - 20 జవాబులు :**

1. యేసుక్రీస్తునకు, ఫిలిప్పీ 2:9
2. ఫిలిప్పీయుల సంఘంతో, ఫిలిప్పీ 4:15
3. దేవుడు, తన ఐశ్వర్యము చొప్పున యేసునందు మహిమతో, ఫిలిప్పీ 4:19
4. కొలస్సీయుల సంఘంలో నమ్మకమైనవాడు, కొలస్సీ 1:8
5. లవొదికయ అను సంఘానికి కొలస్సీ4:16
6. మార్కు కొలస్సీ4:10
7. అపోస్తలుడైన పౌలు ఫిలిప్పీ 1:19,20
8. క్రీస్తుయేసు దాసుడైన ఎపఫ్రా, కొలస్సీ4:12
9. ఫిలిప్పీయుల సంఘం ఫిలిప్పీ 1:7
10. పరలోకమందున్నది 3:20

**బైబిల్‌క్విజ్ - 20 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

శాంతి ప్రియ, సౌజన్య, స్వరూపరాణి, హేమలత, సుధారాణి, కృప, ఆశాకిరణ్, విజయకుమారి, చంద్రకళ, ఎమ్.విజయ, కొర్నేలీ, శ్యామ్‌ప్రసాద్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రియల్

**భాగ్యలత :** పుష్పలత, రాజేశ్వరి, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, తేజ (మిర్యాలగూడ), పీటర్, ఏలియా, సలోమియ, రూతు, సుజాత, గీత, రాహుల్, హెప్సిబా, యోజస్వి, అభినయశ్రీ, సురేష్, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, కృపారావు, జిన్నిబాబు, ఎలీషాబాబి, కె.ఎల్.నరసింహరావు, జయ, అభిషేక్, విమలాప్రసాద్, నోహ, శేషగిరిరావు, రాజేష్, ఆషా, పర్ణిక, గ్రీష్మ, మధురిమ, జీవన్, కెజియా, నోయాగ్రేస్, శ్రీకాంత్‌రవి, పద్మాకర్.

**చింతల్ :** రాజేష్, స్నేహ, శ్రీకాంత్, జయానంద్, బాలరాజు, విజయ్, రాణి, శాంతిప్రియ, రాధామణి, సూర్యదీపిక, శిరీష, సురేంద్ర, హేమకుమారి, జీవన్ కుమార్, విజయ, డేవిడ్, సుధాకర్, మైఖేల్, అనంతరావు, రాజామన్నార్, మోహన్.

**అనాజ్‌పూర్ :** ప్రభుదాస్, మారియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, రూతు, కృపా వరుణ్.

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్.

**'స్పర్శ'** అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________

2. చిరునామా: ______________________

______________________

______________________

పిన్ కోడ్: ______________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________

______________________

______________________

______________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

జనవరి 26, 2012 గురువారం, బాలాజీ ఫంక్షన్ హాల్ - హైదరాబాద్
నందు ఉపవాస ప్రార్థన ఉ. 9 గం.ల నుండి సా. 4 గం.ల వరకు జరిగినది.
దీనిలో అనేకులు పాల్గొని దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.










ఎపఫ్రా మినిస్ట్రీస్ - దైవ కీర్తనలు అను పాటల పుస్తకావిష్కరణ

జనవరి 26, 2012 గురువారం జరిగిన ఉపవాస ప్రార్థనలో జరిగినది.








# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org